సునీత గీసిన బొమ్మ

వసుంధర

మొబైల్ వ్యాన్ శరవేగంతో పోతోంది.

డ్రైవింగ్ సీట్లో కిల్లర్ ఉత్సాహంగా ఉన్నాడు.

నిర్మానుష్యంగా ఉన్న రోడ్డుమీద అవధులు లేని వేగంతో వ్యాన్ నడపడం అతని కెంతో సరదా....

ఆ సమయంలో బాగా దూరంగా రోడ్డు కడ్డంగా నిలబడి ఉన్న మనిషి కనిపించాడు కిల్లర్ కి. ఎందుకైనా మంచిదని ముందే హారన్ ప్రయోగించాడు.

వ్యాన్ ఆ వ్యక్తిని సమీపిస్తోంది.

హారన్ ఆగకుండా మ్రోగుతోంది.

అతడు మాత్రం కదలలేదు.

చివరకు సడన్ బ్రేకుతో వ్యాన్ ఆపాడు కిల్లర్.

ఆ వ్యక్తి వ్యాన్ ఆపడానికే అక్కడలా నిలబడ్డాడని కిల్లర్ కి అర్థమయింది. ఎందుకంటే అతడు రెండు చేతులూ అడ్డంగా చాపి ఉన్నాడు.

అతడొక సర్దార్జీ.

వ్యాన్ ఆగగానే సర్దార్జీ వచ్చి డోరు తెరిచి లోపలకు ప్రవేశించి డోరు మూసి—"అర్జంటుగా దగ్గరిలోని రైల్వేస్టేషన్‌కు పోనియ్—" అన్నాడు.

"ఎవరున్నావ్?" అన్నాడు కిల్లర్.

అప్పుడు సర్దార్జీ చేతిలో సాధారణంగా సిక్కులవద్ద ఉండే కృపాణం తళుక్కున మెరిసింది.

"ప్రశ్న లడగవద్దు. అర్జంటుగా స్టేషన్‌కు పోనియ్...."

"నేను ప్రశ్నలడుగుతాను, జవాబు నచ్చితే నీకు సాయపడతాను. లేదా నీకు బుద్ధి చెబుతాను. నీ చేతిలోని కత్తులు నన్ను బెదిరించలేవు—" అన్నాడు కిల్లర్. అతడి మాటలు ముగిసేసరికి సర్దార్జీ చేతిలోని కృపాణం కిందపడింది. కిల్లర్ అతడి చేతిని మెరుపువేగంతో మెలిపెట్టాడు.

"ఎవరున్నావ్?" అన్నాడు సర్దార్జీ ఆశ్చర్యంగా.

"నా సంగతి తర్వాత చెబుతాను. ముందు నీ సంగతి చెప్పు. నువ్వు టెర్రరిస్టువా?" అనడిగాడు కిల్లర్.

సర్దార్జీ ముఖం అదోలాగైపోయింది—"పంజాబులో జరిగే అల్లర్లు ప్రతి సిక్కునూ టెర్రరిస్టు చేస్తున్నాయి. అందుకే నేనిప్పుడు పంజాబు బయల్దేరాను. టెర్రరిస్టుల్ని అంతంచేసి సిక్కుల దేశభక్తిని నిరూపించుకునేందుకు!"

"ఇక్కడ నీకేమీ పనిలేదా?" అన్నాడు కిల్లర్.

"ఉంది. నేనొక మెకానిక్కుని. గ్యారేజీ నడుపుతున్నాను. పదహారేళ్ళ వయసులో ఇక్కడకు వచ్చాను. ఇప్పుడు నాకు నలభైయేళ్ళు. ఈ ఇరవైనాలుగేళ్ళలోనూ తెలుగువారిలో ఒకడిగా కలిసిపోయి తెలుగు భాష

తున్నాంగా నేర్చుకున్నాను. నా కిందరో తెలుగు మిత్రులున్నారు. వారిలో ముఖ్యుడు శ్రీమన్నారాయణ. అయన్ను నేను అన్న కంటె మిన్నగా గౌరవిస్తాను...."

"ఇదంతా నా కెందుకు చెబుతున్నావు?" అన్నాడు కిల్లర్ అతణ్ని మధ్యలో ఆపుతూ.

"ఆఫీసు పనిమీద ఢిల్లీ వెళ్ళిన శ్రీమన్నారాయణకు అమృతసర్‌లో గురుద్వారా చూడాలనిపించి వెళ్ళాడు. దారిలో కొందరు దుండగు లాయన్ను పెట్రోలు పోసి తగులబెట్టారు... " అన్నాడు సర్దార్జీ.

కిల్లర్ పిడికిళ్ళు బిగిశాయి—"ఎందుకు?"

"నిజమైన సిక్కు—అమాయకుల ప్రాణాలు తీయడు. సిక్కుల పేరుతో కొందరు విదేశీ గూఢచారులీ పని చేస్తున్నారు. వారి కారణంగా సిక్కులకు చెడ్డ పేరు వస్తోంది. ఇంతకాలం యెంతో స్నేహంగా ఉన్న శ్రీమన్నారాయణ కుటుంబం నన్నిప్పుడు ద్వేషిస్తోంది. భాభీజీ నా ముఖం చూడనంటోంది. నిజం చెప్పాలంటే నా కిప్పుడు పంజాబుతో సంబంధం లేదు. నా దేశం తెలుగు దేశం. నా బిడ్డ లీ గడ్డలో పుట్టి పెరిగి పెద్దవారయ్యారు. అయినప్పటికీ పంజాబులో ఎవరో చేసిన తప్పు నన్నిక్కడ నా వాళ్ళకు దూరం చేస్తోంది. అందుకే నేనిప్పుడక్కడకు వెళ్ళి వారి నంతం చేసి వస్తాను...."

కిల్లర్ అదోలా అతడివంక చూసి—"నువ్వు నిజమే చెబుతున్నావా?" అన్నాడు.

"నిజమైన సిక్కు అబద్ధం చెప్పడు—" అన్నాడు సర్దార్జీ

"అయితే ఎందరో పోలీసులు, సైనికులు చేయలేని పని నీ ఒక్కడివల్ల అవుతుందనుకుంటున్నావా?"

"కావచ్చు — కాకపోవచ్చు. నా స్నేహితుడి ప్రాణంతీసినవారి ప్రాణం తీసేదాకా నాకు విముక్తి ముండదు ..." అన్నాడు సర్దార్జీ.

కిల్లర్ అతడి కళ్ళలోని ఆవేశం చదివాడు. అందులో నటనలేదు.

"నిజమైన సిక్కులకు నేను సాయపడతాను. నీతో కాసేపు మాట్లాడాలి. వ్యాన్ పైకి పెడతాను—" అన్నాడు కిల్లర్.

మెటెల్ వేన్ రోడ్డుపక్కకు చేరింది.

"ఇప్పుడు చెప్పు—నీ పేరు?"

"రామ్‌చరణ్‌సింగ్—"

"నీ స్నేహితుడు శ్రీమన్నారాయణను పంజాబులో టెర్రరిస్టులు పెట్రోలుపోసి తగులబెట్టారు. పెట్రోలులో కాలిపోయిన మనిషికి ఆనమాలుండదు. అతడే శ్రీమన్నారాయణ అని నీకెలా తెలిసింది? అసలీ వార్త నీకెలా చేరింది?"

"శ్రీమన్నారాయణతో పాటు అమృతసర్ వెళ్ళిన నరసింగరావు ద్వారా యీ విశేషం తెలిసింది...."

"నరసింగరా వెవరు?"

"అక్కడ ఢిల్లీలో వుంటున్నాడు. శ్రీమన్నారాయణ స్నేహితుడు...."

"టెర్రరిస్టులు శ్రీమన్నారాయణను కాల్చి నరసింగరావు నెందుకు వదలిపెట్టారు?"

"నరసింగరావు కార్లో యిద్దరూ అమృతసర్‌కు బయలేరారు ఢిల్లీ నుంచి. దారిలో టెర్రరిస్టులు వారి కారాపారు. ఇద్దరూ కారు దిగారు. టెర్రరిస్టులు వారిద్దర్నీ "ఖలిస్థాన్ జిందాబాద్—" అనమన్నారు.

ఇద్దరూ అనలేరు. అనకపోతే చంపేస్తామన్నారు వాళ్ళు. నరసింగరావు వెంటనే ఆవేశాడు. శ్రీమన్నారాయణ టెర్రరిస్టుల్ని నిందించసాగాడు. అంతే వాళ్ళతన్ని పెట్రోలుపోసి తగలబెట్టి నరసింగరావుతో "— ఈ విషయం హిందువులందరికీ చెప్పుకుంటావని నిన్ను వదలి పెడుతున్నాం—" అన్నారు. నరసింగరావు వాళ్ళు వెళ్ళేదాకా ఆగి కాల్లో దగ్గరవున్న పోలీస్ స్టేషన్‌కి వెళ్ళి ఫిర్యాదు చేశాడు. పోలీసు సంరక్షణతో అతడు ఢిల్లీ చేరుకున్నాడు—"

రామచరణ్ సింగ్ చెబుతూంటే కిల్లర్ కళ్ళెర్ర బడ్డాయి—"మిస్టర్ సింగ్! ఇలా యెంతకాలమో కొనసాగదు. టెర్రరిస్టులపై సిక్కులు కూడా తిరగబడాలి. అప్పుడే దేశంలో సిక్కులకు కూడా రక్షణ లభిస్తుం—"

"అందుకే—ముందుగా నేను తిరగబడుతున్నాను. నాకు నా మతమెంతో నా దేవుడెంతో నా ఆలయమెంతో నా స్నేహితులూ అంతే! . నా స్నేహితులంతా హిందువులు...." అన్నాడు రామచరణ్ సింగ్ ఆవేశంగా.

కిల్లర్ మనిషి కాస్త చల్లబడ్డాడు—"నేను నిన్ను నమ్ముతున్నాను. నీకు సాయపడతాను. అయితే ఇలా ఉన్నపళంగా బయల్దేరడం కాదు. ముందుగా కొంత సమాచారం సేకరించాలి—"

"సమాచారం సేకరించడాని కేముంది? పంజాబు నిండా టెర్రరిస్టులున్నారు. వాళ్ళు సామాన్యులను మత ప్రచారంతో రెచ్చగొడుతూ సోదర హిందువులమీద ద్వేషం నూరిపోస్తున్నారు. వాళ్ళను బ్రతకనివ్వ

కూడదు...."

"నువొక్కడివీ ఏం చేయగలవు?"

"ప్రతీకారం తీర్చుకుంటాను. నా ప్రాణానికి ప్రాణం శ్రీమన్నారాయణ మృతికి కారకులయినవారిని అంతం చేస్తే ఆ తర్వాత నేనేమైనా బాధుండదు—"

కిల్లర్, సింగ్ భుజం తట్టి—"నీ ఆవేశం నాకర్థమయింది. కానీ నీ ఆశయం నెరవేరాలంటే ఇలా ఉన్న పళంగా బయల్దేరి లాభంలేదు. ముందుగా నరసింగరావును కలుసుకుని కొన్ని వివరాలు సేకరించాలి—...." అన్నాడు.

"అందుకే బయల్దేరాను నేను...."

"అలాంటప్పుడిక్కడెలా ఉన్నావు?"

రామ్‌చరణ్‌సింగ్ తల వంచుకున్నాడు.

చెప్పడానికతడు తటపటాయిస్తున్నాడని గ్రహించి- "ఎటూ కాని ఈ ప్రాంతానికి నీవెలా వచ్చావో నా కాశ్చర్యంగా ఉంది—" అన్నాడు.

"శివరాజా నన్ను చంపాలని యిక్కడకు తీసుకొచ్చాడు."

"శివరాజెవరు?" అన్నాడు కిల్లర్.

"మా ఊరిగుండా! శ్రీమన్నారాయణకు స్నేహితుడు. తద్వారా నాకూ స్నేహితుడు. నన్ను మంచి మాటలతో యిక్కడకు తెచ్చి—ఇక్కడ నన్ను చంపబోయాడు. నేనప్పుడతణ్ని వేడుకున్నాను. శివరాజా నవ్వి—"మా శ్రీమన్నారాయణకు పట్టిన గతే నీకూ పట్టాలి. మీ సిక్కులకు లేని కరుణ నాకెందుకుండాలి?" అన్నాడు. నేను వెంటనే—"శ్రీమన్నారాయణ నీ వాడే కాదు. నావాడు కూడా! అతడి చావుకు ప్రతీ

కారం తీస్తున్నేలోగా చావకూడదని నా కోరిక. నాకా అవకాశ మివ్వు. నన్ను వదలి పెట్టు—" అన్నాను.

శివరాజు వినలేదు. అప్పుడు నేను తిరగబడ్డాను. అతణ్ణి లొంగదీసుకున్నాను. శివరాజు నేను తనని చంపుతాననుకున్నాడు. నే నతడితో—నిజమైన సిక్కు అకారణంగా హత్య చేయడు. నా పట్ల నీకు గల దురభిప్రాయం తొలగించడమే నా ఆశయం. ఈ క్షణమే నేను పంజాబు వెడతాను. నీవు ఇంటికి వెళ్ళి నీ వదినకు, నా పిల్లలకు రక్షణ కల్పించు. ప్రాణాలతో తిరిగివస్తే మళ్ళీ కలుసుకుందాం—" అన్నాను. శివరాజు నన్ను తెచ్చిన జీపులో వెనక్కు వెళ్ళిపోయాడు. తర్వాత నాకు స్ఫురించింది—జీపులో నేను రైల్వేస్టేషన్‌కు పోవాల్సిందని! అప్పట్నించీ యేదయినా వాహనం వస్తుందేమోనని ఎదురుచూస్తున్నాను...."

కిల్లర్ సాలోచనగా—"శ్రీమన్నారాయణకు గూండాలు స్నేహితులుగా ఉన్నారంటే అసలత నెలాంటివాడు?" అన్నాడు.

"గూండాలూ మనుషులే! వారిలో గూండాలను చూసేవారు, వారిని గూండాలుగా ఉపయోగించుకునే వారూ కిరాతకులు. వారిలో మనుషులను చూసేవారు స్నేహితులు. శివరాజుకు శ్రీమన్నారాయణంటే గొప్ప ఆకర్షణ!" అన్నాడు సింగ్.

"శ్రీమన్నారాయణ యేం చేస్తుంటాడు?"

"బిజినెస్...."

కిల్లర్ కాసేపాలోచించి—"బాగా ఉన్నవాడా?" అన్నాడు.

"ఊఁ" అన్నాడు సింగ్—"ఆయనకు స్వంతానికే

మూడు కార్లున్నాయి. వ్యాపారానికి సంబంధించి పన్నెండు ట్రక్కులు. ఎనిమిది వ్యాన్‌లు, ఆరు కార్లున్నాయి—"

"ఏమిటాయన వ్యాపారం?"

"రవాణా—...." అని — "ఇవన్నీ ఎందుకడుగుతున్నారు?" అన్నాడు సింగ్ అనుమానంగా.

"చనిపోయిన మనిషినిబట్టి రియాక్షన్ వుంటుంది. శ్రీమన్నారాయణ బాగా గొప్పవారైతే ఊళ్ళో చాలా పెద్ద కలకలం రేగి వుండాలి. నువ్వు భయపడి ఊళ్ళొంచి పారిపోయుండాలి—" అన్నాడు కిల్లర్ సాలోచనగా.

"విషయం అందరికీ తెలియదు—" అన్నాడు సింగ్. ఢిల్లీ పోలీసులీ విషయానికి ప్రచారమివ్వద్దని నరసింగరావును కోరారు. నరసింగరావు టెలిగ్రాం ద్వారా శ్రీమన్నారాయణ పెద్దకొడుకును ఢిల్లీ రప్పించి అసలు విషయం చెప్పి—శ్రీమన్నారాయణ ప్రమాదవశాత్తు చనిపోయినట్లు ప్రచారం చేయమన్నాడు. అతడందు కంగీకరించాడు.

ఇక్కడికొచ్చేక శ్రీమన్నారాయణ భార్యకు విషయం తెలిసింది. నాతో మాట్లాడ్డం మానేసింది. ఏం జరిగిందో నాకు తెలియదు. మాకూ వాళ్ళకీ కుటుంబ సంబంధాలు కూడా తగ్గిపోయాయి. ఒకరోజు నేను శివరాజు దగ్గర విషయం చెప్పుకుని బాధపడ్డాను. సంగతేమిటో తెలుసుకుంటానని అతడు వెళ్ళాడు. అక్కడ అతడికి విషయం తెలిసినట్లుంది. నన్నిక్కడకు తీసుకుని వచ్చాడు. విషయం తెలియగానే నేనూ ఆవేశపడ్డాను...."

కిల్లర్ నిట్టూర్చి—"ఢిల్లీలో నరసింగరావు చిరునామా తెలుసా నీకు?" అనడిగాడు.

"కరోల్ బాగ్‌లో సౌతిండియా హోటల్ నడుపుతున్నాడతడు. బోర్డింగూ, లాడ్జింగూ కూడా వున్నాయి. హోటల్ పేరు వరాహనృసింహ సౌతిండియన్ కాఫీ హౌస్...."

"అయితే మనమిద్దరం కలిసి ఇప్పుడే బయల్దేరుదాం."

"ఎక్కడికి?"

"ఛలో ఢిల్లీ!"

"మరి నీ వ్యానెక్కడ పెడతావు?"

"వ్యాన్‌లోనే మన ప్రయాణం-" అన్నాడు కిల్లర్.

"వ్యాన్‌లోనా-అయితే ఢిల్లీ ఎప్పటికి చేరేటట్లు?" అన్నాడు సింగ్ నిస్పృహగా.

"ట్రయిన్‌కంటే ముందు వెడతాం...."

"కావచ్చు. కానీ ఏకబిగిని డ్రైవ్ చేయలేం కదా!"

"నీకు నా వ్యాన్ సంగతి తెలియదులే—మనమిద్దరం రాత్రిళ్ళు సుఖంగా నిద్రపోవచ్చు. కంప్యూటర్ కంట్రోలులో వ్యాన్ దానంతటదే నడుస్తుంది..."

"నిజమా?" అన్నాడు సింగ్ ఆశ్చర్యంగా.

"కావాలంటే చూడు...." అంటూ కిల్లర్ డ్రైవింగ్ సీట్లోంచి తప్పుకున్నాడు.

వ్యాన్ యెప్పటిలాగే పయనిస్తోంది. మలుపులు కనే తిరుగుతోంది. వెనుకనుంచి వచ్చే వాహనాలకు దారినిస్తోంది. ముందున్న వాహనాలను దారివ్వగానే దాటించుకుని వెళుతోంది. స్పీడ్ బ్రేకర్ల దగ్గర స్లో అవుతోంది. దారికడ్డంగా యేమైనా వుంటే ఆగిపోతోంది.

"కలలా వుంది. ఇలాంటి వాహనాలుంటాయని నాకు తెలియదు...." అన్నాడు సింగ్ ఆశ్చర్యంగా.

"నీకు తెలియనివెన్నో నాకు తెలుసు. అందుకే నీకు

ప్రాయం అవసరం—....” అన్నాడు కిల్లర్.

“డ్రైవింగ్ సీట్లో మనిషి కనబడకపోతే దారిన పోయేవాళ్ళు చూసి అనుమానించి విడ్డూరంగా చూడరూ?” అన్నాడు సింగ్ అనుమానంగా.

“కంప్యూటర్ డ్రైవింగ్ సమయంలో వ్యాన్ అద్దాలలోంచి మనకు బైట జరిగేదంతా కనబడుతుంది. బయటివారికి లోపలెవరున్నదీ కనపడదు. ఫిల్మ్‌స్టార్సు కార్లలో వెళ్ళేటప్పుడు తామూ యిలాంటి యేర్పాట్లే చేసుకుంటారు....” అన్నాడు కిల్లర్.

“నీవు చాలా శక్తిమంతుడిలా కనబడుతున్నావు. ఈపాటికే టెర్రరిస్టుల పనిపట్టవలసింది....”

“నిజమైన శక్తిమంతుడు శక్తిని మించిన పని తలపెట్టడు....” అన్నాడు కిల్లర్ నవ్వుతూ.

“అంటే?” అన్నాడు సింగ్.

“సామాన్యులకు సామాన్యుడిని కాకపోవచ్చు కానీ నేను సామాన్యుణ్ని. నాకున్న శక్తిని సామాన్య కోసం వినియోగించాలనుకున్నంత కాలం నేను శక్తిమంతుడిగా వుంటాను. పంజాబు టెర్రరిస్టులను ఎదుర్కోవాలనుకోవడం—చిట్టెలుక సింహంతో తలపడడం వంటిది. పొట్టేలు కొండను ఢీకొనడంవంటిది. నేనప్పుడు సామాన్యులకు మిగలకుండా పోతాను. టెర్రరిస్టుల నెదుర్కొనేందుకు ప్రభుత్వముంది. ప్రభుత్వ యంత్రాంగముంది-” అన్నాడు కిల్లర్.

“అయితే ఇప్పుడెందుకు నాతో వస్తున్నావు?”

“నువ్వొక గ్యారేజిలో మెకానిక్కువి. అలాంటి నువ్వే టెర్రరిస్టుల నెదిరించడానికి బయల్దేరుతున్నావు ఒంటరిగా. నేను నేరస్థులకు సింహస్వప్నంగా వుండా

లన్న ఆశయంతో సరంజామా సేకరించుకున్న వాణ్ని. నీ ఆవేశం నన్నా వేశపరిచింది—" అన్నాడు కిల్లర్.

"ఇంతకీ ఎవరు నువ్వు?"

"నా పేరు కిల్లర్. అయామ్ కిల్లర్ ఆఫ్ ఎనీథింగ్ ట్రాయల్ ...."

సింగ్ కిల్లర్ కేసి ఆశ్చర్యంగా చూశాడు.

వ్యాన్ డ్రైవింగ్ సీట్లో యెవరూ లేకుండానే ముందుకు దూసుకుని పోతోంది.

2

నరసింగరావింట్లో డ్రాయింగ్ రూమ్....

గది మరీ అంత విశాలమైనదికాదు కానీ గది ఇంటి వారి అభిరుచిని తెలియజేస్తోంది.

గోడకు ఇండియా మ్యాప్ .... పక్కగా గాంధీ, నెహ్రూ. శాస్త్రి, ఇందిర, రాజీవ్ గాంధీల ఫోటోలు వ్రేలాడుతున్నాయి.

అందమైన కాశ్మీర్ కార్పెట్ మొత్తం నేలనంతా కవర్ చేసింది.

గది మధ్యలో సోఫాల్లో కూర్చుని వున్నారు నరసింగరావు, కిల్లర్, సింగ్ ....

కిల్లర్ నరసింగారావునే చూస్తున్నాడు.

అతడు ఖద్దరు పంచ ధరించి వున్నాడు. దానిమీద ఖద్దరు చొక్కా, కండువా! చూడ్డానికి రాజకీయ నాయకుడిలా ఉన్నాడతడు.

పచ్చటి దబ్బపండులాంటి ఛాయ....

"నా పేరు కిల్లర్ —" అన్నాడు కిల్లర్.

"ఢిల్లీలో కిల్లర్స్‌కి లోటులేదు —" అన్నాడు నరసింగరావు.

"అయ్యా మేం కిల్లర్సాఫ్ కిల్లర్స్...."

నరసింగరావతడి వంక కుతూహలంగా చూసి—"మీరు చెప్పదల్చుకున్న దేమిటి?" అన్నాడు.

కిల్లర్ క్లుప్తంగా అతడికి విషయం వివరించాడు.

నరసింగరావు లేచి కిల్లర్ని సమీపించి చేయిచాచి షేక్‌హ్యాండిచ్చాడు.

"అయాం వెరీ వెరీ హాపీ.... నా ప్రాణమిత్రుడు శ్రీమన్నారాయణను క్రూరంగా చంపిన ఆ దుర్మార్గులను సర్వనాశనం చేయడానికి మీకెలాంటి సహకారం కావాలన్నా నేనందజేయగలను...." అన్నాడతడు.

"అందుకే మీ దగ్గరకు వచ్చాను. మీరు దేశభక్తులని మీ డ్రాయింగ్‌రూం, దుస్తులు చూసి చెప్పవచ్చు. మీ వంటివారిచేత ఖలిస్తాన్ జిందాబాద్ అనిపించిన వారిపై మీకు అపరిమితమైన ద్వేషముండాలి...." అన్నాడు కిల్లర్.

"లేదు...." అన్నాడు నరసింగరావు.

సింగ్ అతడి వంక ఆశ్చర్యంగా చూశాడు.

"ఎందుకు లేదు?" అన్నాడు కిల్లర్.

"నా బలహీనతకు నేను వారినెందుకు ద్వేషించాలి? శ్రీమన్నారాయణలా నేనూ నా ప్రాణాలకు తెగించి వారినెదిరించవచ్చు. కానీ నా దేశభక్తి వేషధారణకూ, డ్రాయింగ్‌రూంకు మాత్రమే పరిమితమయింది. నాలో ధైర్యం తక్కువ. నా ప్రాణాలు రక్షించుకునేందుకు నేనేమైనా చేయగలనని రుజువయింది. ఇప్పుడు నన్ను నేనే ద్వేషించుకోవాలి.. శ్రీమన్నారాయణను రక్షించుకోలేనందుకు.... అతడిలా ధైర్యాన్ని ప్రదర్శించలేనందుకు...."

"నిజం చెప్పాలంటే మీ పరిస్థితుల్లో నేనైనా అంతే చేసేవాణ్ని. శ్రీమన్నారాయణ అసాధారణ పురుషుడు. అలాంటి ధైర్యం మహాత్ములకు గానీ సాధ్యపడదు—" అన్నాడు కిల్లర్.

"అందుకే అతడు పోయాడు. పాపీ చిరాయువు.... అంటారు కదా— నేను మిగిలాను...!" అంటూ నరసింగరావు కళ్ళు మూసుకుని— "ఆ మంటల్లో మాడిపోతూ కూడా శ్రీమన్నారాయణ భరతమాతకు వందనాలు పలికాడు—" అన్నాడు.

అతడి గొంతు గద్గదమయిందని గమనించాడు కిల్లర్.

"మీరే రూట్లో వెళ్ళారో—ఎలా వెళ్ళారో—నాకు వివరాలు కావాలి...." అన్నాడు కిల్లర్.

"చెబుతాను. అసలా దుండగులెలావున్నారో కూడా మీకు నేను చెప్పగలను—...." అన్నాడు నరసింగరావు.

"చెప్పండి—" అన్నాడు కిల్లర్.

నరసింగరావు లేచి లోపలకు వెళ్ళాడు. కొద్దిక్షణాల్లోనే ఆయన వెనక్కు వచ్చాడు. ఆయన చేతిలో గుండ్రంగా చుట్టబడిన ఒక అట్ట పేపరుంది.

కిల్లర్ ఆ పేపరందుకున్నాడు.

అందులో ముగ్గురు వ్యక్తులున్నారు.

ఒకడు సన్నగా పొడుగ్గా వున్నాడు. ఒకడు లావుగా పొట్టిగా వున్నాడు.

"నేను వాళ్ళ బొమ్మలు గీశాను...." అన్నాడు నరసింగరావు.

"ఎవ్వరికీ గడ్డాలు లేవు.." అన్నాడు కిల్లర్.

సింగ్ ఆ బొమ్మలవంకే చూస్తూ—"వీళ్ళు నిజంగా

నిక్కాలే అయితే—ఖలిస్తాన్ విషయం మెలాగున్నా మాంచి సుత్రద్రోహం చేశారు—గడ్డాలు తీసేసి.." అన్నాడు.

నరసింగరావు నిట్టూర్చి—"ఎవరు వీళ్ళ నిందుకు ప్రోత్సాహిస్తున్నారో ముందు వాళ్ళ అంతు తేల్చాలి—" అన్నాడు.

కిల్లర్ ఆ బొమ్మలకంకే ఆశ్చర్యంగా చూస్తూ—"మీరు చెప్పింది నిజం, తప్పు వీళ్ళది కాదు, వీళ్ళను నడిపించే వాళ్ళది—" అన్నాడు.

"నడిపించేవాళ్ళు చెప్పినట్లు నడవడానికి మనిషికి మాత్రం బుద్ధి డొద్దూ?" అన్నాడు సింగ్ కోపంగా.

"ఒక గాంధీ ప్రబోధిస్తే—సామాన్యుడు లాఠీ దెబ్బలకు రొమ్మిచ్చి నిలబడ్డాడు. ఒక హిట్లర్ ప్రబోధిస్తే—నాజీ సైన్యం మనుషుల్ని కీటకాల్లా మార్చేసింది. నాయకత్వపు శక్తి ఉన్నవాడు తన అనుచరుల చేత మానవ కల్యాణం సాధించగలడు. మారణహోమం చేయగలడు. తప్పొప్పులు అనుచరులవి కాదు. నాయకులవి...." అన్నాడు కిల్లర్.

"ఉన్నట్టుండి మీ దృష్టి నాయకుల పైకి మళ్ళిందేం?" అన్నాడు నరసింగరావు.

"ఎందుకంటే ఈ మగ్గురు మనుషుల్లో నా కు రాక్షసత్వం కనబడడంలేదు. వారి కళ్ళలో త్యాగదీక్ష, దేశభక్తి ప్రతిఫలిస్తున్నాయి...."

"నేను బొమ్మ తప్పు వేసివుంటాను. శ్రీమన్నారాయణను వాళ్ళు పెట్రోలు పోసి తగులబెడుతూంటే వాళ్ళకళ్ళల్లో నేను పైశాచికానందాన్ని నా కళ్ళారా చూశాను. వాళ్ళు మంచివాళ్ళు కాదు. పరమ కిరాతకులు—...." అన్నాడు నరసింగరావు ఆవేశంగా.

"బ్రిటిష్ వారిపై బాంబులు వేసి ఉరికంబ మెక్కిన వారు మనకు అమరవీరు లయ్యారు. వారి కళ్ళలో మనం క్రూరత్వాన్ని చూడగలమా? మనకు చెందనివారు మన దేశంలో అడుగు పెట్టి మనను బానిసలుగా చూస్తూంటే సహించలేక తిరగబడ్డ మహాత్ములు వారు. భరత ఖండంలో అన్ని మతాలవారూ సమానంగా సామరస్యంతో జీవిస్తూంటే — కొందరు వేర్పాటువాదులు లేని యొక్కువతక్కువల్ని సృష్టించి — సిక్కులకు హిందువులు బ్రిటిష్ వారే నన్న దురభిప్రాయం సృష్టించారు. అది నమ్మిన అమాయకులు తాము దేశభక్తులమనీ, త్యాగపరులమనీ నమ్ముతూ సోదరుల నూచకోత కోస్తున్నారు. తప్పు వారిది కాదు. వారిని నడిపిస్తున్న వారిదే!"

"కానీ....." ఏదో అనబోయాడు నరసింగరావు.

"మీలోని చిత్రకారుడు గొప్పవాడు. చూసింది చూసినట్లుగా బొమ్మ గీశాడు. మీ స్నేహితుడు మీ కళ్ళముందే కాలిపోతూంటే మీకు వారు క్రూరులుగా కనిపించి ఉండవచ్చు. కాని మీలోని చిత్రకారుడు వారిని యధాతధంగా ఫోటో తీసి మనసులో ముద్రించాడు. ఈ ఫోటోలోని వ్యక్తులు తప్పుదారిలో నడుస్తున్న మంచి పౌరులనడంలో సందేహంలేదు—" అన్నాడు కిల్లర్ సాలోచనగా.

"మీ పరిశీలనాశక్తి అద్భుతం....ఇప్పుడు మీరేం చేయాలనుకుంటున్నారు? వీరి సాయంతో అసలువారిని పట్టగలరా? ప్రభుత్వ గూఢచారులకు సాధ్యపడనిది మీకు సాధ్యపడుతుందా....?" అన్నాడు నరసింగరావు.

"ఇలా ఆలోచించేవాడు సాహసం చేయలేడు. నేను సాహసిస్తున్నాను" అన్నాడు కిల్లర్.

"మీకు అన్ని వివరాలూ చెబుతాను. కానీ ఎక్కడా నా పేరు రాకూడదు. ఈ బొమ్మలోని వ్యక్తులను నా ద్వారా గుర్తిస్తున్నట్లు మీరెక్కడా అనకూడదు. నేను నీతిగా నే బ్రతుకుతున్నా ధైర్యవంతుణ్ని కాను. బ్రతుకు మీద ఆశ, భీతి—రెండూ వున్నవాణ్ని—" అన్నాడు నరసింగరావు.

కిల్లర్ ఆయనకు హామీ యిచ్చాడు.

3

కిల్లర్ తనూ సిక్కు వేషంలోనే వున్నాడు. అతడు తనతో పంజాబీ మాట్లాడుతుంటే సింగ్ ఆశ్చర్యంగా "ఇరవై నాలుగు సంవత్సరాలు తెలుగు దేశంలో వుండి కూడా నేను స్వచ్ఛమైన తెలుగు నేర్చుకోలేకపోయాను. నా మాటలో పంజాబీయాస తెలిసిపోతుంది. నువ్వు అచ్చం పంజాబీలా మాట్లాడుతున్నావు—...." అన్నాడు.

"అందులో ఆశ్చర్యమేముంది—....?" అన్నాడు కిల్లర్.

"తెలుగు యాస లేదు నీ భాషలో—ఆశ్చర్యం కదూ?"

"నేను తెలుగువాడి ననీ — పంజాబీని కాదనీ నీ కెవరు చెప్పారు?—...." అన్నాడు కిల్లర్ కాస్త చిరాగ్గా.

"అయితే నువ్వు పంజాబీవా?" అన్నాడు సింగ్ ఆశ్చర్యంగా.

"నన్నిప్పుడు చూస్తుంటే నీ , కెలా కనబడు

తున్నావు?"

మొబైల్ వ్యాన్ సాగిపోతూంటే సింగ్ కిల్లర్ ని పట్టి పట్టి చూశాడు, మాటలో, రూపంలో—అతడిని సిక్కు కాదనడం కష్టం!

"అచ్చం నేటివ్ సిక్కులాగున్నావు!"

కిల్లర్ నవ్వి—"చూశావా—కాస్త అభ్యాసంతో మనిషి ఏ భాషనైనా మాట్లాడవచ్చు. ఏ రూపాన్నైనా ధరించవచ్చు. అంటే అర్థమేమిటి—అంతా ఒక్కటేనని కదా! ఇది తెలిసి కూడా మనిషి—మతం పేరిట, భాష పేరిట—రక్తపాతాన్నెందుకు సృష్టిస్తాడో నాకర్థంకావడం లేదు. నీకూ అర్థం కాదనుకుంటాను...." అన్నాడు.

"అవును రాష్ట్రం వదలిపెట్టిన మూలాన అంతా ఒక్కటేనన్న భావం నాలో బాగా పేరుకుపోయింది. కానీ ఇంతకీ నువ్వెక్కడివాడివి?"

"అది తెలుసుకోవాల్సిన అవసరం నీకు లేదు. గుర్తుంచుకోవాల్సిన అవసరం నాకు లేదు. నేను భారతీయుణ్ని....అంతే!"

ఉన్నట్లుండి వ్యాన్ సడన్ బ్రేకుతో ఆగింది.

దారి కడ్డంగా పెద్ద పెద్ద బండరాళ్ళున్నాయి.

బిలబిలమంటూ పదిమంది ముసుగు మనుషులు వ్యాన్ని చుట్టుముట్టారు. కిల్లర్ వ్యాన్ దిగి అచ్చమైన పంజాబీలో వారిని పలకరించాడు.

"ఖలిస్తాన్ విమోచనకు చందా యిచ్చి వెళ్ళండి—" అన్నారు వాళ్ళు.

"నా దగ్గర ఒక్క పైసా కూడా లేదు—" అన్నాడు కిల్లర్.

"అది మేము చూసుకుంటాం__" అన్నారు వాళ్ళు.

"మీ యిష్టం...." అన్నాడు కిల్లర్.

ఒకడు వెనుకనుంచీ వ్యాన్ తలుపు తెరిచాడు. అంతే!

బుస్సుమంటూ అదోరకం గ్యాస్ వచ్చింది.

క్షణాలమీద వ్యాన్ చుట్టూ వున్న ముసుగుమనుషులు స్పృహతప్పి పడిపోయారు.

"ఏం జరిగింది?" అన్నాడు సింగ్ ఆశ్చర్యంగా.

"వీళ్ళకు స్పృహతప్పింది. మరో గంటదాకా నిద్ర లేవరు...." అన్నాడు కిల్లర్.

"మరి మనకు తప్పలేదేం?"

"వ్యానెక్కేముందు నేను నీకో చూయింగ్ గమ్మిచ్చాను కదా. అది దీనికి యాంటిడోట్...."

"నువ్వు అసాధ్యుడివి__...." అన్నాడు సింగ్.

"కావచ్చు. కానీ__నాకూ అసాధ్యాలున్నాయి.."

సింగ్ మాట్లాడలేదు. కిల్లర్తో కలిసి అతడా మనుషులందర్నీ వ్యాన్లోకి చేరవేశాడు. ఓ పదినిమిషాల్లో వాళ్ళు దగ్గర్లో వున్న పోలీస్ స్టేషన్కి చేరుకున్నారు. అక్కడ కిల్లర్ జరిగింది చెప్పాడు. పోలీసులా మనుషుల్ని స్వాధీనపర్చుకున్నారు.

ఇన్స్పెక్టర్ వాళ్ళని చూసి__"వీళ్ళు టెర్రరిస్టులు కాదు. పాత ఖైదీలు__" అన్నాడాశ్చర్యంగా.

"టెర్రరిజం ప్రారంభమైతే ఇలా ఉపయోగించుకునేందుకెందరో అవకాశవాదులుంటారు__" అన్నాడు కిల్లర్..

కిల్లర్ అక్కడ తన వివరాలేమీ చెప్పలేదు. దొంగ

అను పట్టుకున్న ఘనత పోలీసులకే వదిలిపెట్టి అతడు ముందుకు వెళ్లాడు.

చివరకు శ్రీమన్నారాయణ తగులబడ్డ చోటు చేరుకున్నాడు.

అదొక మైలురాయి. రాతి పక్కగా సన్నని కాలిబాట. కాలిబాటలో వందగజాల దూరం నడిస్తే ఓ చెట్టు.

ఆ చెట్టుకింద స జీ వ ద హ నం అయిపోయాడు శ్రీమన్నారాయణ.

జాగ్రత్తగా పరిశీలిస్తే ఇప్పటికీ అక్కడ కొన్ని గుర్తులున్నాయి—ఓ మనిషి సజీవంగా కాలిపోయినట్లు.

కిల్లర్ ఆ ప్రాంతాన్ని శ్రద్ధగా పరిశీలించాడు.

సింగ్ అక్కడే కూలబడి వెక్కి వెక్కి ఏడ్వసాగాడు.

తన పరిశోధన అయ్యాక—"ఇంక ఏడుపు ఆపు—" అన్నాడు కిల్లర్.

"నువ్వు నన్నిక్కడే పెట్రోలు పోసి తగులబెట్టు—" అన్నాడు సింగ్.

"ఎందుకు?"

"నా జాతి చేసిన అన్యాయానికి శ్రీ మన్నారాయణ ఆహుతి అయిపోయాడు. అందుకు బదులుగా నేను ప్రాయశ్చిత్తం చేసుకుంటాను...."

"నీ ఆలోచనలు మూర్ఖత్వంతో నిండివున్నాయి. నువ్వు సిక్కువు కాదు. మనిషివి. శ్రీమన్నారాయణ హిందువుకాదు. మనిషి. ఒక మనిషి అతడిని అన్యాయంగా సజీవదహనం చేశాడు. అందుకు నువ్వు బాధ్యుడివి కాదు...."

"అంటే?"

"శ్రీమన్నారాయణను సిక్కు చంపాడు కాబట్టి అది నీ బాధ్యత అయింది. అదే యే ముస్లిమో, హిందువో చంపితే అది నీ బాధ్యత కాదా? నిన్ను నువ్వు యేదో జాతికి పరిమితం చేసుకోవడం సంకుచితం. మనమిప్పుడన్వేషిస్తున్నది సిక్కు తీవ్రవాదులను కాదు. మన స్నేహితుణ్ని దారుణంగా చంపిన కొందరు దుష్టులను. తెలిసిందా?"

సింగ్ కాస్త ఊరటచెంది — "బాభీజీ నాతో మాట్లాడ్డం మానేసింది. స్వంత అక్కలా నన్నాదరించే బాభీజీ అలా ప్రవర్తించేసరికి నామీద నాకే ద్వేషం పుట్టుకొచ్చింది. ఇక్కడ శ్రీమన్నారాయణ అహుతైన దృశ్యం తలపులోకి రాగానే నాకు పిచ్చెక్కినట్లయింది. నీ మాటలు నాకు కాస్త ఊరటను కలిగించాయి—" అన్నాడు.

"అనవసరంగా ఆవేశపడకు. ఎవరో చేసిన తప్పుకు నిన్ను బాధ్యుణ్ని చేసుకోకు....పద....పోదాం—" అన్నాడు కిల్లర్.

మళ్ళీ వాళ్ళ వ్యాన్ బయల్దేరింది.

దగ్గర్లో ఇంకో పోలీస్ స్టేషన్....

అక్కడ ఇన్స్పెక్టర్ బహదూర్ సింగ్ వారితో యెంతో అభిమానంగా మాట్లాడాడు.

కిల్లర్ అతడికి శ్రీమన్నారాయణ హత్య గురించి గుర్తుచేశాడు.

"అవునవును. మహాదారుణమది. మన సిక్కులందరూ సిగ్గుపడాల్సిన చర్య అది!" అన్నాడు బహదూర్ సింగ్.

"దుండగులు దొరికారా?"

"లేదు—"

"వారికే అవకాశముందా?"

"తీవ్రవాదుల గురించి యెన్నో ప్రయత్నాలు చేస్తున్నాము. ప్రత్యేకించి ఈ ముఠా గుర్ని పట్టుకునే అవకాశంలేదు. వారి ఐడెంటిటీ తెలియదు...."

"నరసింగరావు మీకు చెప్పలేదా?"

"ఏవో గుర్తులు చెప్పాడు. కానీ అవి చాలవు. ఆయన బాగా షాక్ తిన్నట్లు కనిపించాడు .... నేను పోలీసు రక్షణతో ఢిల్లీకి పంపాను..."

"ఆయన చెప్పిన వెంటనే మీరు చుట్టుపక్కలకు సెర్చి పార్టీలు పంపలేదా?"

"పంపి ప్రయోజనముండదు. అయినా అప్పుడు నా వద్ద స్టాఫు మరీ యెక్కువగా లేదు.," అన్నాడు ఇన్స్పెక్టరు.

కిల్లర్ కాసేపు తటపటాయించి చివరకు తనవద్దనున్న ఆర్టు పేపరు ఇన్స్పెక్టరుకి చూపించాడు.

"ఎవరు వీళ్ళు?" అన్నాడు బహదూర్ సింగ్ ఆశ్చర్యంగా.

"నేను నరసింగరావు చెప్పింది విని—ఈ బొమ్మ గీశాను. ఆయనీ బొమ్మచూసి భయపడుతూ—వీళ్ళే.... వీళ్ళే..నా స్నేహితుణ్ని కాల్చేశారు..కానీ వీళ్ళ గుర్తులు నేను చెప్పినట్లెవరికీ చెప్పవద్దు. నాకు భయంగావుంది.. అన్నాడు. కాబట్టి మీరు కూడా ఆయన విషయం మరిచిపోయి — వీళ్ళలో యెవరినైనా గుర్తించగలరేమో చెప్పండి.." అన్నాడు కిల్లర్.

బహదూర్ సింగ్ ఆ బొమ్మల వంకే ఆశ్చర్యంగా చూస్తూ—"ఆ రోజు నరసింగరావు నాకు చెప్పిన విష

రాలకీ ఈ బొమ్మలకీ ఖాత్రిగా పోలిక లేదు-" అన్నాడు.

"అప్పుడాయన బాగా షాక్ తిని ఉన్నాడు. ఇప్పుడు తాపీగా జరిగినవన్నీ గుర్తుచేసుకొని చెప్పిన వివరాలివి.." అన్నాడు కిల్లర్.

"మీరు చెప్పింది నిజం. ఆ రోజాయన వణికిపోతున్న తీరు చూస్తుంటే నాకు మన జాతిమీద అసహ్యం కలిగింది. మనిషి బాగా పిరికివాడిలాగున్నాడు. అలాంటి వాణ్నంతలా బెదరగొట్టడం మహాఘోరం.."

"ఎంతటి ధైర్యవంతుడైనా గుండెలు జలదరించే పని చేశారు దుండగులు..ఆయన వణికిపోవడంలో ఆశ్చర్యమేముంది? ఈ ఫోటోలో వ్యక్తులు మీకు తెలుసా?" అన్నాడు కిల్లర్.

"తెలుసు. కానీ వీళ్ళు దుండగులు గావడానికి వీల్లేదు..."

"ఎందుకని?"

"వీళ్ళు హిందువులు!"

"మీకు బాగా తెలుసా?" తెల్లబోతూ అడిగాడు కిల్లర్.

"తెలుసు.." అన్నాడు బహదూర్ సింగ్ నమ్మకంగా.

"వాళ్ళు హిందువులే అయితే ఇలాంటి పనెందుకు చేస్తారు?"

ఇన్స్పెక్టర్ ఆలోచనలో పడ్డాడు. కాసేపాగి ఆయన "వీళ్ళు ముగ్గురూ అన్నదమ్ములు. వీళ్ళ గ్రామం ఇక్కడికి అరవై కిలోమీటర్ల దూరంలో వుంది. వీళ్ళ తండ్రి మహావీర్ సింగ్_నీతికీ, నిజాయితీకీ, త్యాగానికీ, ధైర్యానికీ పెట్టింది పేరు. ఆ ఊళ్ళో హిందువులు తక్కువ, సిక్కులెక్కువ. అయినప్పటికీ మహావీర్ సింగ్ కారణంగా

అక్కడి సిక్కులందరూ ఒక్కటై హిందువుల నభిమా నిస్తున్నారు. మత సామరస్యం అక్కడున్నంతగా యింకెక్కడా లేదు. మహావీర్ సింగ్ కు జాతీయస్థానంలో ఏదైనా బహుమతిప్పించాలని రాష్ట్రప్రభుత్వం అనుకుం టోంది...." అన్నాడు.

కిల్లర్ తనూ ఆలోచిస్తూ — "మహావీర్ సింగ్ ఆర్థిక పరిస్థితి ఎలాంటిది?" అనడిగాడు.

"ఒకప్పుడు బాగా వుండేదిట. ఇప్పుడు చితికి పోయాడు. అప్పుల్లో ఉన్నా డంటారు. ఏడాదిక్రితం కూతురి పెళ్ళి చేసి యిల్లమ్ముకున్నాడు. ఆ ఇల్లు కొను క్కున్న సిక్కు జాలి తలచి ఆ యింట్లోనే అతడినుండ నిస్తున్నాడు...."

"మహావీర్ సింగ్ గురించి మీ కిన్ని వివరాలెలా తెలుసు?" అడిగాడు కిల్లర్.

"ఈ చుట్టుపక్కల పేరెన్నికగన్న సంఘసేవకు డాయన...."

కిల్లర్ ఇన్ స్పెక్టర్ కు ధన్యవాదాలు చెప్పి లేచాడు.

"చాలా థాంక్స్" అన్నా డతడు.

"మీరింతవరకూ వచ్చినందుకు అభినందించాలి. ప్రజలు పంజాబులో అడుగుపెట్టాలంటే భయపడిపో తున్నారు. అడపాతడపా అక్కడా యిక్కడా అల్లర్లు జరుగుతున్న మాట వాస్తవం. అంతమాత్రాన పంజాబు వెళ్ళడమంటే అడవికి పోవడంకాదు—" అన్నాడు ఇన్ స్పెక్టర్.

కిల్లర్ నవ్వి—"ఆ నిజం వచ్చేదాకా తెలియదుకదా! రావడానికి ధైర్యముండాలికదా.." అన్నాడు.

అంతవరకూ మౌనంగా వారి సంభాషణ వింటున్న

సింగ్ చటుక్కున నోరు తెరిచి—"ఆ ధైర్యం నా స్నేహితుడు శ్రీమన్నారాయణకుంది. ధైర్యమితడికిచ్చిన ప్రతిఫలం చూశారుగా—" అన్నాడు.

కిల్లర్ సింగ్ భుజం తట్టి—"ఏ మనిషికి చావెలా రాసి పెట్టి ఉంటుందో చెప్పడం కష్టం. పడవ మునగవచ్చు. పాము కాటేయవచ్చు. ఇల్లు కాలిపోవచ్చు. స్టవ్ పేల వచ్చు. దురదృష్టం మనిషి నకాలమృత్యువుకు గురిచే స్తుంది—" అన్నాడు.

"దురదృష్టం ధైర్యవంతుణ్ని పొట్టనబెట్టుకుంటే బాధగా వుంటుంది కదా!" అన్నాడు సింగ్.

"పద—పోదాం—" అన్నాడు కిల్లర్ అతడి భుజం తట్టి.

ఇద్దరూ ఇన్‌స్పెక్టర్ దగ్గర సెలవు తీసుకొని వ్యానెక్కారు.

"ఇంతవరకూ మనం సాధించినదేమిటి?"

"చాలా వుంది..." అన్నాడు కిల్లర్ వ్యాన్ స్టార్టు చేస్తూ.

"చాలా ఉందా? మనం వెనక్కి వెళ్ళిపోతున్నాం కూడా.." అన్నాడు సింగ్ అర్థంకానట్లు.

"అవును..కానీ మహావీర్ సింగ్‌ను కలుసుకున్నాక.."

"అతడి నెందుకూ కలుసుకోవడం?"

వ్యాన్ స్టార్టయింది. కిల్లర్ మందహాసంచేసి—"అతడిలో పెద్దరహస్యమే ఉన్నదని నా అభిప్రాయం" అన్నాడు.

సింగ్ మాట్లాడలేదు.

"నరసింగరావు ముగ్గురు యువకుల బొమ్మలు గీశాడు. వారు మహావీర్ సింగ్ బిడ్డలు.."

"కానీ వారు హిందువులు..."

"కావచ్చు. కానీ సంఘసేవ పేరు చెప్పి ఆస్తంతా పాడు చేసుకున్న మహావీర్ సింగ్ బిడ్డలు వారు.."

"అంటే?"

"నాకు తెలుసు, అలాంటివారి బిడ్డలెలా తయారవుతారో! పేరు ప్రతిష్టలు మనిషికి కూడు పెట్టవు...."

కిల్లర్ కాసేపాగి — "మహావీర్ సింగ్ మహానుభావుడు కావచ్చు. కానీ ఉగ్రవాదుల కలాంటి వాకవు. వారు పేరున్న ప్రతి హిందువునూ తుడిచిపెట్టేయాలనుకుంటారు. మహావీర్ సింగ్ కుటుంబానికి ప్రమాదం రాకుండా అతడి బిడ్డలు కొందరు సిక్కు ఉగ్రవాదులకు సహకరిస్తున్నారని నా నమ్మకం...."

"హిందువుల నాశనానికి హిందువులు సహకరిస్తారా....?"

"హిందువులు, సిక్కులు అన్నది మనకు నాయకులు కల్పించే భ్రమ. నాయకులకు సంబంధించి అదంతా స్వార్థం. మన దేశంలో మన దేశానికి వ్యతిరేకంగా ఇతర దేశాలకు పనిచేసే గూఢచారులు - భారతీయులే వున్నారు. కాదంటావా?"

సింగు కళ్ళు పెద్దవయ్యాయి — "నువ్వు చెప్పింది నిజమే! డబ్బు కోసం, స్వార్థం కోసం — రష్యన్లు రష్యాకు అమెరికన్లు అమెరికాకు, బ్రిటన్లు ఇంగ్లండ్‌కు వ్యతిరేకంగా పనిచేసిన వార్తలు చాలా విన్నాను. మహావీర్ సింగ్ పిల్లలు కూడా అలాంటివారేననుకోవాలి...."

"ఇందులోని నిజానిజాలు ఆరాతీయడానికే మనం

మహావీర్ సింగ్ యింటికి వెళుతున్నాం—" అన్నాడు కిల్లర్.

వ్యాను స్పీడందుకుంది.

4

అది పురాతనకాలపు పెద్దిల్లు.

ఇంట్లో పేదరికపు ఛాయలు కనబడుతున్నాయి.

కిల్లర్, సింగ్ వ్యాన్ దిగేసరికి గుమ్మంలోనే వారికి మహావీర్ సింగ్ ఎదురయ్యాడు. వాళ్ళు తనకోసమే వచ్చారని తెలుసుకుని ఆయన తనే మహావీర్ సింగ్‌నని చెప్పుకున్నాడు.

ఇద్దరూ ఆయనకు ప్రణామాలు చేశారు.

మహావీర్ సింగ్ ఆశ్చర్యంగా, "మీ రెవరు? వాతో మీకేం పని?" అనడిగాడు.

"మీ గురించి విని మిమ్మల్ని చూడాలని వచ్చాం—" అన్నాడు కిల్లర్.

వాళ్ళిద్దరూ ఆంధ్రాలో స్థిరపడిన సిక్కులని తెలిసి— "ఇంత దూరం వచ్చి చూసేటంత విశేషం నాలో వుందనుకోను. మో రింకేదో పనిమీద వచ్చారు—" అన్నాడు మహావీర్ సింగ్.

"మీరు చెప్పింది కొంతవరకూ నిజం. ఇక్కడకు మేము వేరే పనిమీద వచ్చాం. పంజాబులో సిక్కులు హిందువులను హత్య చేయడంవల్ల యితర రాష్ట్రాలలోని సిక్కులందరికీ ప్రాణాపాయ పరిస్థితి ఏర్పడింది. సిక్కులు భారతదేశమంతా నిండి వుండి హిందూ సంస్కృతిలో ఒక భాగంగా కలిసిపోయారు. ఇతర ప్రాంతాలవారితో సోదరసమానులుగా జీవిస్తున్న సిక్కుల సుఖజీవితంలో నిప్పులు పోస్తున్న పంజాబు టెర్రరిస్టుల్ని కలుసుకుని

మాట్లాడాలని వచ్చాం. వాళ్ళ నెలా కలుసుకోవాలో తెలియదు గానీ మీ గురించి విన్నాం. ఈ విషయంలో మీ అభిప్రాయం తెలుసుకోవడం మంచిదనిపించింది—....."

మహావీర్ సింగ్ ముఖం గంభీరంగా అయిపోయింది.

"ఈ విషయంలో మీరు చేయవలసింది ఒక్కటే! పంజాబులోని సిక్కులందరూ ఒక్కటై టెర్రరిజాన్ని నిరసించండి. టెర్రరిజానికి వ్యతిరేకంగా ప్రదర్శనలు జరుపండి. అప్పుడు సాటి ప్రజలకు టెర్రరిజాన్ని మీరూ నిరసిస్తున్నారన్న భావం ఏర్పడుతుంది. ఇంతవరకూ ఇతర రాష్ట్రాలలో సిక్కులలాంటి ప్రయత్నాలు చేసినట్లు లేదు—....."

"మీరు చెప్పింది నిజమే!" అన్నాడు సింగ్ — "అయితే పంజాబులోని హిందువుల రక్షణకు మేమేం చేయగలం?"

మహావీర్ కళ్ళెర్రబడ్డాయి — "నేను పంజాబీని. నా రక్షణకు ఒకరిపై ఆధారపడను...."

కిల్లర్ మాట మార్చుతూ "మీ జీవన విధానం గురించి తెలుసుకోవాలనుంది—" అన్నాడు.

మహావీర్ సింగ్ తన కుటుంబం గురించి గర్వంగానే చెప్పుకున్నాడు. తన భార్య, అల్లుళ్ళ గురించి చెప్పుకున్నాక—"నా కొడుకుల పద్ధతే నాకు నచ్చలేదు—" అన్నాడు.

"ఎందుకని?"

"ముగ్గురబ్బాయిలు నాకు. వాళ్ళు పల్లె విడిచి వెళ్ళారు. ఇక్కడే వుండి నాకు సాయపడతానంటారు. నా కెవరి సాయమూ వద్దన్నా వినరు. వాళ్ళ స్నేహితులు నలుగురైదు

గుడు ప్రొఫెసర్లతో కలిసిపోయారు. అప్పుడప్పుడు వాళ్ళూ వీళ్ళూ కలుసుకుంటూంటారు. నేనూ మా వాళ్ళకు చెప్పాను—ఆ ప్రొఫెసర్ల మనసులేనా మార్చండి. లేదా వాళ్ళ ఆమూకీ పోలీసులకు చెప్పండి—అని! కానీ వాళ్ళు వినరు. సంపాదన గురించి హెచ్చరిస్తే డబ్బు సంపాదించడానికి అన్ని మార్గాలంటారు. ఒక్కడూ వెళ్ళి చేసుకోనంటాడు.... పంజాబులో శాంతి నెలకొనేదాకా వాళ్ళు బ్రహ్మచారులుగా ఉండిపోతారుట.... అదిప్పట్లో జరిగే పనేనా?" అంటూ నిట్టూర్చాడు మహావీర్ సింగ్.

"ఎందరో మిమ్మల్ని గౌరవిస్తున్నారు. మీ మాట చాలామందికి శిలాశాసనం. అలాంటప్పుడు మీ వాళ్ళు మాత్రం మీరు కానిస్తే ఎందుకు వినరు?"

"ఎందుకు వినరు—వింటారు. కాని నా పిల్లలు మానవత్వంలో నన్ను మించినవారు. నాకు డబ్బుమీద మోజు లేదు...." అని—"సుమారు రెండు నెలల క్రితం అనుకుంటాను. ఓ తమాషా జరిగింది...." అన్నాడాయన.

కిల్లర్, సింగ్ వింటున్నారు.

"మా ఊరిచివర రోడ్డుదగ్గర ఓ కారాగి ఉంది. అందులో యిద్దరు తెలుగువాళ్ళున్నారు. ఒకాయన పేరు శ్రీమన్నారాయణ. రెండో ఆయన పేరు నరసింగరావు. ఆ శ్రీమన్నారాయణ గారు దిగి కంగారుగా అటూ యిటూ తిరుగుతూంటే మా వాళ్ళు చూశారు. కారులో నరసింగరావు స్పృహతప్పి పడివున్నాడు. మా వాళ్ళు వాళ్ళిద్దర్నీ మా యింటికి తెచ్చారు. మా ఊళ్ళో డాక్టరు లేడు. పొరుగూరి డాక్టరు బాగా డబ్బునిషి. పిలవడానికి వెడితే రానన్నాడు. మా వాళ్ళు బలవంతంగా

ఎత్తుకని తీసుకుని వచ్చారు. డాక్టరు రావడం కాస్త లేటై వుంటే ఆ నరసింగరావు చచ్చిపోయేవాడు. డాక్టరుకు శ్రీమన్నారాయణ బాగా డబ్బిచ్చి పంపాడు. రెండ్రోజులపాటు వాళ్ళకు మేము శక్తికి మించిన అతిథ్యం యిచ్చాం. అదంతా మా వాళ్ళే చూసుకున్నారు. నరసింగ రావు వెళ్ళిపోతూ—వాళ్ళని—మీరు మనుషులు కాదు, దేవుళ్ళు—అన్నాడు...."

"అసలా నరసింగరావు కేమయింది?"

"డాక్టరు చెప్పిన కారణం టెన్షన్!"

"టెన్షన్ ఎందుకు?"

"కావాలని అమృతసర్ వెడుతున్నారు. మనిషి మరీ అంత ధైర్యవంతుడు కాకపోవచ్చు. ఏ క్షణంలో ఏమవుతుందోనన్న భయం ఎక్కువగా వుందనుకుంటాను. నేనతణ్ణి వెనక్కి వెళ్ళిపొమ్మని సలహా యిచ్చాను. శ్రీమన్నారాయణ మాత్రం తానుండగా నరసింగరావు కే ప్రమాదం రాదనీ—ముందుకే వెడతామనీ చెప్పాడు. అందుకు నరసింగరావూ అంగీకరించాడు. మా వాళ్ళు డాక్టర్ని తీసుకొచ్చిన పద్ధతికి వాళ్ళు తల్చుకుని నవ్వుకుంటూండేవారు—" అన్నాడు మహావీర్ సింగ్.

"ఒక్కసారి మీ వాళ్ళను చూసి వెడతాము—" అన్నాడు కిల్లర్.

"వాళ్ళిప్పుడింట్లోనే వున్నారు—" అంటూ మహావీర్ సింగ్ లోపలకు వెళ్ళాడు.

కిల్లర్, సింగ్ తో—"అనుకోకుండా మనకు శ్రీమన్నారాయణ కథను తనే చెప్పాడీయన. ఈ కథ నన్ను మరింత అయోమయంలోనికి తోసేసింది—...." అన్నాడు.

"నాకు మొదట్నించీ అంతా అయోమయంగానే ఉంది—" అన్నాడు సింగ్.

మహావీర్ సింగ్ తన ముగ్గురు కొడుకుల్నీ తీసుకుని వచ్చాడు.

కిల్లర్ కు వాళ్ళు దేశభక్తుల్లా కాక గూండాల్లా కని పించారు. అల్లరి చిల్లరి మనుషుల్లా వున్నారు వాళ్ళు. అతడు వాళ్ళని శ్రీమన్నారాయణ గురించి మరికొన్ని ప్రశ్నలు వేశాడు. చెప్పుకోదగ్గ సమాచారం లభించ లేదు.

టెర్రరిస్టుల గురించి కిల్లర్ వారిని మరికొన్ని ప్రశ్నలు వేశాడు.

"వాళ్ళను టెర్రరిస్టులనకండు. వాళ్ళు మా స్నేహి తులు...." అన్నాడు మహావీర్ సింగ్ పెద్దకొడుకు.

"మీ స్నేహితులు హిందువులను కాల్చి చంపు తున్నారు...."

"వాళ్ళు కాల్చి చంపుతున్నది హిందువులను కాదు. సిక్కు మత వ్యతిరేక ప్రచారకుల్ని. వాళ్ళకు హిందువుల మీద నే ద్వేషముంటే మమ్మల్నెప్పుడో చంపేసే వారు...."

"అయితే మీరు మీ స్నేహితులకు సహకరిస్తు న్నారా?"

ముగ్గురూ మాట్లాడలేదు.

"మీ స్నేహితులు కోరితే మీ ముగ్గురూ ఓ అమాయ కుణ్ని కాల్చి చంపగలరా?" అన్నాడు కిల్లర్.

"ఓ మనిషిమీద పెట్రోలు పోసి అంటించమని టెర్రరిస్టులు చెబితే మీరు చేయరూ?"

ముగ్గురూ మాట్లాడలేదు.

కిల్లర్ వాళ్ళ ముఖభావాలనే గమనిస్తున్నాడు.

"ఈ ప్రశ్నలు మీరు మమ్మల్నెందుకు అడుగుతున్నట్లు?" అన్నాడు మహావీర్ సింగ్.

కిల్లర్ అతడికి శ్రీమన్నారాయణ టెర్రరిష్టుల చేత కాల్చబడ్డ విశేషం చెప్పాడు.

"అసాధ్యం! ఆ రోజు మా స్నేహితు లీ ప్రాంతాల లేరు—" అన్నాడు మహావీర్ సింగ్ పెద్దకొడుకు.

"వాళ్ళు కాకపోతే వాళ్ళ పేరుతో మరొకరు ..." అన్నాడు కిల్లర్.

"ఇందులో ఏదో తిరకాసుంది—" అన్నాడు మహావీర్ సింగ్ రెండో కొడుకు.

మహావీర్ సింగ్ మూడో కొడుకు సాలోచనగా—
"మీరు చెప్పిన ప్రాంతాలలో తోతారామ్ అనే కుర్రాడు తిరుగుతూంటాడు. అక్కడేం జరిగినా వాడి దృష్టి నుంచి తప్పించుకోదు—" అన్నాడు.

"తోతారాం ఎవరు?"

"వాడొక పశువుల కాపరి. కానీ విచిత్రమైనవాడు. వాడు చెబితే పశువులు బుద్ధిగా వుంటాయి. ఇతరుల పొలాల్లోకి వెళ్ళవు. ఎక్కడికీ తప్పిపోవు. వాటి మానాన వాటిని వదిలి తనెక్కడెక్కడో తిరుగుతూంటాడు వాడు....

"అయితే మనం వాణ్ని కలుసుకుందాం—" అన్నాడు కిల్లర్.

"మీ రిక్కడే ఉండండి. నేను వాడిని కలుసుకుని అసలు విషయం తెలుసుకుని వస్తాను...." అంటూ మహావీర్ సింగ్ మూడో కొడుకు లేచాడు.

"నేనూ వస్తాను. వాణ్ని నేను స్వయంగా కలుసుకుని

మాట్లాడాలి—" అన్నాడు కిల్లర్.

"లాభంలేదు. తోతారాంను పట్టుకోవడం, మాట్లాడించడం ఇతరులవల్ల కాదు .." అంటూ జవాబుకోసం ఎదురుచూడకుండా తాను వెళ్ళిపోయాడు మహావీర్ సింగ్ మూడో కొడుకు.

"నరసింగరావు పెద్రరిస్టు ఎలా వుంటారో మీకు వర్ణించి చెప్పలేదా?" అన్నాడు మహావీర్ సింగ్.

"చెప్పాడు—" అన్నాడు కిల్లర్.

"వాళ్ళెలా వుంటారో చెప్పండి. మా స్నేహితుల పోలికలతో కలుస్తాయేమో చూద్దాం—" అన్నాడు మహావీర్ సింగ్ రెండో కొడుకు.

కిల్లర్ అతడి కళ్ళలోకి చూశాడు. కుతూహలం, భయం, అనుమానం వగైరా రకరకాల భావాలున్నాయి ఆ కళ్ళలో!

"వాళ్ళు ముగ్గురు. దృఢంగా ఉంటారు. గెడ్డాలూ, మీసాలూ వుండవు. చూడగానే హిందువు అనిపిస్తుంది ..." కిల్లర్ వాళ్ళ ముఖభావాలను గమనిస్తూ అన్నాడు.

మహావీర్ సింగ్ నిట్టూర్చి—"మతం గుర్తు తెలియాలంటే—మనిషికో, ఆలయానికో రూపం మార్చాలి. మత గ్రంథానికి వేరే పేరు పెట్టాలి. లేకుంటే అంతా ఒక్కటే కదా!" అన్నాడు.

సింగ్ తానెక్కువగా సంభాషణలో జోక్యం చేసుకోవడంలేదు. "అతడా ముగ్గురు యువకుల్నీ నరసింగరావు హంతకులుగా చిత్రించి ఇచ్చాడన్న నిజాన్ని బయట పెడతాడా?" అని ఆలోచిస్తున్నాడు.

కిల్లర్ కీ, సింగ్ కీ—యింట్లోంచి పకోటాలూ, ఆలూ

మటన్ వచ్చాయి. వేడిగా వున్న ఆ పదార్థాలు వారి కెంతో రుచికరంగా అనిపించాయి.

కాసేపు వారక్కడ విశ్రాంతి తీసుకున్నారు.

సుమారు గంట తర్వాత మహావీర్ సింగ్ మూడో కొడుకు తిరిగివచ్చాడు. అతడి ముఖం నీరసంగా వుంది.

"ఏమయింది?" అనడిగాడు మహావీర్ సింగ్ ఆశ్చర్యంగా.

కొడుకు మాట్లాడలేదు.

"తోతారాం దొరకలేదా?"

"దొరికాడు...."

"తనావేళ ఏమైనా చూశాట్టా?"

"చూశాడు—"

"ఏం చూశాడు?"

"చెబితే ఎవరూ నమ్మరు...."

"నేను నమ్ముతాను—చెప్పు!"

"నరసింగరావు శ్రీమన్నారాయణను చంపేశాట్ట...."

అందరి కంటే యెక్కువగా రామచరణ్ సింగ్ ఉలిక్కిపడ్డాడు.

"అదెలా సాధ్యం?" అన్నాడు మహావీర్ సింగ్.

"ఇద్దరు మనుష్యులా వస్తూంటే అంతవరకూ చెట్టుకింద కూర్చున్న తోతారాం చెట్టుచాటుకు వెళ్ళాట్ట. ఏం జరుగుతుందో గమనిస్తున్నాట్ట. వాళ్ళిద్దరూ వాడి కర్థం కాని భాషలో మాట్లాడుకుంటున్నారుట. ఇద్దరూ నవ్వుతూ స్నేహంగా మాట్లాడుకుంటున్నారుట. ఉన్నట్టుండి నరసింగరావు తన చేతిలోని డబ్బాలోని పెట్రోలు చటుక్కున శ్రీమన్నారాయణమీద పోసి — ఏమేమో

పోట్లాడేట్ట. శ్రీమన్నారాయణ భయపడ్డాట్ట. తర్వాత అతడు లైటరుతో శ్రీమన్నారాయణను అంటించే శాట్ట....శ్రీమన్నారాయణ భయంకరంగా కేకలు పెడుతూంటే అతడిమీద మరింత పెట్రోలు విదిలించి పకపకా నవ్వేట్ట....శ్రీమన్నారాయణ పూర్తిగా కాలిపోయే దాకా అక్కడే ఉన్నాట్ట. తర్వాత వెళ్ళిపోయాట్ట—...."

కిల్లర్ అతడివంక చూసి—"తోతారాం అబద్ధాలు చెప్పడని నమ్మకమేనా?" అన్నాడు.

"ఊఁ."

"ఇలా అడుగుతున్నానని యేమీ అనుకోవద్దు. తోతారాం అనేవాడు నిజంగా ఉన్నాడా?" అన్నాడు కిల్లర్ మళ్ళీ.

"ఎందుకిలా అడుగుతున్నారు?" అన్నాడు మహావీర్ సింగ్.

"ఎందుకంటే?" ఒక్కక్షణం ఆగాడు కిల్లర్— "తోతారాం నిజంగా ఉంటే తప్ప మీరు చెప్పిన నిజం తెలిసేదికాదు. ఆ నిజమేమిటంటే—... ఒక స్నేహితుణ్ని నరసింగరావు కొత్త ప్రాంతంలో చంపేశాడు. అదీ యెప్పుడు? అతడు తన ప్రాణాలు రక్షించేక....ఇలా జరగొచ్చని మీరు నమ్ముతారా?"

"నేను నమ్మలేక పోయాను. నాకు మానవత్వం మీదనే నమ్మకం నశించింది. అందుకే నిరసంగా తిరిగి వచ్చాను—" అన్నాడు మహావీర్ సింగ్ మూడ్లో కొడుకు.

"నాకు మానవత్వంమీద నమ్మకముంది. అందుకే

తో తారాం ఉనికిని నమ్మలేకపోతున్నాను—" అన్నాడు కిల్లర్.

మహావీర్ సింగ్ ఆశ్చర్యంగా—"లేని తోతారాంను ఉన్నట్లు చెప్పాల్సిన అవసరం మావాడి కేముంది?" అన్నాడు.

"ఏమో—అతడికే తెలియాలి—...." అన్నాడు కిల్లర్.

మహావీర్ సింగ్ తన ముగ్గురు కొడుకులకంకా అనుమానంగా చూశాడు. కళ్ళతో నే వాళ్ళాయనకు సమాధానమిచ్చారు.

తండ్రి ప్రశ్న, కొడుకుల జవాబు కూడా కిల్లర్ చదివాడు.

"తోతారాం నిజంగా వున్నాడు—" అన్నాడు మహావీర్ సింగ్.

కిల్లర్ నవ్వి "నేనిక సెలవు తీసుకుంటాను—" అన్నాడు.

అతడలా అనిగినందుకు రామ్‌చరణ్ సింగ్ ఆశ్చర్యపడ్డాడు.

5

"మనం ఢిల్లీ పోయేపక్షంలో ఏం తెలుసుకున్నట్లు?" అన్నాడు సింగ్.

"మహావీర్ సింగ్ మంచివాడు. ఆయన కొడుకులు దుదుకుమనుషులు. అల్లరిచిల్లరగా డబ్బు సంపాదించే రకాలు. ఆయన వాళ్ళ గురించి పరోక్షంగా నిజాలు చెప్పి ప్రత్యక్షంగా అబద్ధాలు చెప్పాడు. వాళ్ళకు పెళ్ళి కావడం లేదంటే సంబంధాలు రావడంలేదన్న మాట. వాళ్ళాయుకవదలి వెళ్ళడం లేదంటే వాళ్ళకు చదువు రాలే

దన్నమాట. వాళ్ళకు పెట్రోరిస్టులతో స్నేహమున్నదంటే తుంటరి స్నేహితులున్నారని అర్థం. వాళ్ళు బలవంతంగా డాక్టర్ని తెచ్చారంటే అలాంటి పనులు వాళ్ళకి మామూలన్నమాట. శ్రీమన్నారాయణిచ్చే డబ్బు కాశపడి వాళ్లాయన్నా, నరసింగరావుమా తమ ఇంటికి తీసుకుని వెళ్ళి వుంటారు—"

"అంటే వాళ్ళే శ్రీమన్నారాయణను కాల్చి చంపేరంటావా?"

"అదే నిజమని నాకు తోస్తే వెంటనే వాళ్ళ అంతు తేల్చేయన్నీ. కానీ ఈ విషయంలో వాళ్ళు నిరపరాధులు. తోతారాం అనేవాడున్నాడో లేదో నాకు తెలియదు కానీ వాళ్ళు చెప్పింది నిజం—...."

"అంటే?"

"నరసింగరావే కావాలని శ్రీమన్నారాయణుని పెట్రోలు పోసి అంటించాడు. ఆ నేరం పంజాబు పెట్రరిస్టులమీదకి తోసేయాలనే ఉద్దేశంతో అతడు శ్రీమన్నారాయణను ప్రోత్సహించి అమృతసర్ ప్రయాణానికి పురిగొల్పాడు. తను తప్పు చేయబోతున్నానని అతడికి తెలుసు. ఇలాంటి నేరాలు నతను గతంలో చేసివుండడు. అందుకల్ల అంతులేని టెన్షన్కు గురయ్యాడు. తాననుకున్న చోటు సమీపించే సరికతడు టెన్షన్ భరించలేక స్పృహతప్పి పడిపోయాడు—" అన్నాడు కిల్లర్.

"నువ్వు చెప్పింది బాగానే వుంది. కానీ తన ప్రాణాలను రక్షించిన శ్రీమన్నారాయణ నతడెలా చంపగలడు? తన్ను రక్షించిన మహావీర్ సింగ్ ముగ్గురు తోడుకల్నే హంతకులుగా నిరూపించాలని ఎందుకు చూస్తాడు?" అన్నాడు సింగ్.

"ఏవో కారణా ఉంటాయి. అదే తెలుసుకోవాలి. శ్రీమన్నారాయణపై అతనికి బాగా కక్ష ఉండివుండాలి. ఆ కక్ష తీర్చుకుందుకు టెర్రరిస్టుల నతిడు తెలివిగా ఉపయోగించుకున్నాడు. అతనికి మహావీర్ సింగ్ కొడుకు అంటే కృతజ్ఞత వుంది. అందుకే వాళ్ళను హంతకులుగా చిత్రిస్తూనే అతడు తనకు తెలియకుండానే వాళ్ళ కళ్ళలో త్యాగశీలతను ప్రతిబింబించేలా చేశాడు. వాళ్ళను నువ్వూ చూశావుగదా! వాళ్ళు మంచిమనుషుల్లా లేరు-" అన్నాడు కిల్లర్.

"జరిగింది బాభీజీ నమ్ముతుందా? నా నిర్దోషిత్వాన్ని కుటుంబం అంగీకరిస్తుందా?" అన్నాడు రాంచరణ్ సింగ్.

"నిజాన్ని మనం బైటపెట్టక తప్పదు. లేకుంటే మరి కొందరు దుర్మార్గులిది అవకాశంగా తీసుకుని అన్యాయాలకు, అక్రమాలకు తలపెడతారు. టెర్రరిస్టుల పేరుతో జరిగిన దుశ్చర్యలను లోతుగా పరిశీలించే అవకాశంకూడా ఏర్పడుతుంది...."

సింగ్ సాలోచనగా—"పంజాబులో ప్రతి యింటా తుపాకీ ఉంటుంది. చాలామంది తమ పాత పగలను టెర్రరిస్టుల పేరుతో తీర్చుకుంటున్నారేమోనని నా కిప్పుడనుమానంగా వుంది—...." అన్నాడు.

"కొన్ని అబద్ధాల కారణంగా నిజం అబద్ధం అయిపోదు. పంజాబులో టెర్రరిజం కొనసాగుతున్న మాట నిజం. కొందరది అవకాశంగా తీసుకోవడం దురదృష్టం—...."

"నరసింగరావుకు వ్యతిరేకంగా మనం సంపాదించిన సాక్ష్యాలకు రుజావు కావాలి. మనం తోతారాంను కలు

సుకోవలసింది. మహావీర్ సింగ్ యింట్లోని విశేషాలు టేప్ చేయవలసింది—" అన్నాడు సింగ్.

"ఆ సాక్ష్యాలు కోర్టులో నిలబడవు. తోతారాం కోర్టుకు వచ్చి సాక్ష్యమివ్వకపోవచ్చు. ఇచ్చినా అతడి సాక్ష్యానికి విలువుంటుందని గ్యారంటీ లేదు. మహావీర్ సింగ్ కొడుకు ఈ హత్య చేయలేదని నిరూపించలేము. ఎందుకంటే శ్రీమన్నారాయణ హత్య గురించి విన్నాక నే వారు తోతారాం గురించి కల్పించి వుండవచ్చు. మన పరిశోధన నరసింగరావు కెంత వ్యతిరేకంగా ఉందో మహావీర్ సింగ్ కొడుకులకీ అంతే వ్యతిరేకంగా వుంది. నాకు నరసింగ రావుమీదే అనుమాన ముంది. అతడిచేత నిజం చెప్పించే ఉపాయం చూడాలి తప్ప—మహావీర్ సింగ్ కుటుం బాన్ని ఇబ్బందిలో పెట్టకూడదు—" అన్నాడు కిల్లర్.

6

వ్యాన్ నరసింగరావింటి ప్రాంగణంలో ప్రవేశించింది. అప్పుడు కిల్లర్ మామూలు వేషంలో వున్నాడు. ఇంట్లో నరసింగరావు లేడు. చెప్పాలంటే ఎవ్వరూ లేరు. ఆయన కుమార్తె సునీత మాత్రం ఉంది. ఆమె బియ్యే ఫైనలియర్ పరీక్ష లవ్వాల్సి ఉంది. అందుకే ఒంటరిగా ఉంది.

"ఒంటరిగా ఉండడం నా కలవాటే?" అందామె నవ్వుతూ.

"నాన్నగా రెప్పుడొస్తారు?" అన్నాడు కిల్లర్.

"అంతా ఆగ్రా వెళ్ళారు. బహుశా రేపు సాయం త్రానికి రావచ్చు...."

"రెండ్రోజుల క్రితం మేము మీ ఇంటికి వచ్చాం...."

అన్నాడు కిల్లర్.

"మీరు నాకు తెలుసు" అందామె.

"ఎలా? ఆ రోజు మిమ్మల్నింట్లో చూడలేదు నేను...." అన్నాడు సింగ్.

ఆమె లోపలకు వెళ్ళి ఓ ఆర్టు పేపరు తెచ్చింది. దాని మీద కిల్లర్ రాంచరణ్ సింగుల బొమ్మలున్నాయి.

"మీరు వచ్చినప్పుడు నే నింట్లో లేను. నేను వచ్చే సరికి మీరు వెళ్ళిపోయారు. నాన్న ఆగ్రా వెడుతూ మీ గుర్తులు నాకు చెప్పారు. నేను బొమ్మ వేశాను. పోలికలు సరిగ్గా వచ్చేయన్నారు. ఇప్పుడు చూస్తూంటే నాకు చాలా తృప్తిగా వుంది. నాన్న గుర్తులు సరిగ్గా చెప్పగలరు. నే నది బొమ్మగా వేయగలను...."

"మీరు వేయడమెందుకు? మీ నాన్నగారే గొప్ప చిత్రకారులు కదా!" అన్నాడు కిల్లర్.

సునీత నవ్వి — "నాన్న బొమ్మ వేయడమా? ఆయన మనిషిని వేయాలనుకుంటే ఏ వంకరకాళ్ళ గాడిదో తయారవుతుంది—" అంది.

అప్పుడు కిల్లర్ తన దగ్గరున్న బొమ్మ చూపించి— "ఇది మీ నాన్నగారు వేయలేదా?" అన్నాడు.

ఆ బొమ్మను చూసి సునీత తడబడి—"ఈ బొమ్మ మీ దగ్గరకెలా వచ్చింది?" అంది.

కిల్లర్ క్లుప్తంగా తన కథ చెప్పి—"శ్రీమన్నారాయణ వంటి సచ్ఛీలుణ్ణి, నీతిపరుణ్ణి, దేశభక్తుణ్ణి, స్నేహపాత్రుణ్ణి అమానుషంగా కాల్చిచంపిన క్రూరాతిక్రూరులు వీళ్ళు. మీ నాన్నగారు నాకు వీళ్ళ బొమ్మనిచ్చారు...." అన్నాడు.

"వీళ్ళ బొమ్మను నాన్న వేయలేదు. నేను వేశాను...." అంది సునీత.

సింగ్ ఆశ్చర్యంగా కిల్లర్ వంక చూశాడు. కిల్లర్ ఆ బొమ్మవంక చూశాడు.

తన అంచనా కొత్తం తప్పుతున్నట్లుంది.

ఆ బొమ్మలోని మహావీర్ సింగ్ కొడుకులు ముగ్గురూ దుష్టుల్లా కాక కథానాయకుల్లాగున్నారు. నరసింగరావుకు సంబంధించి అందుకు కారణం వెతికాడు తను.

సునీత కేమి కారణముంది?

"నువ్వీ బొమ్మ వేసేముందు—వీళ్ళు నరహంతకులని మీ నాన్న నీకు చెప్పలేదా?"

"ఆయనేం చెప్పారో నాకు తెలియదు. కానీ నాకు మాత్రం వీళ్ళు నరహంతకు అనిపించరు....!" అంది సునీత.

"శ్రీమన్నారాయణ వంటి సచ్ఛీలుణ్ణి.... సత్పురుషుణ్ణి "

కిల్లర్ యింకా యేదో అనబోతూండగా—"ఆపండి కిల్లర్ గారూ!" అంది సునీత అసహనంగా.

"ఏమయింది?" అన్నాడు కిల్లర్.

"తండ్రి స్నేహితుడని నమ్మి సంకోచించకుండా గది లోకి వచ్చిన కూతురీడు ఆడపిల్లను యుక్తాయుక్త విచక్షణాజ్ఞానం లేకుండా బలాత్కారంచేవాడిని సచ్ఛీలుడు, సత్పురుషుడు అనడం తప్పు కాకపోతే మీరు శ్రీమన్నారాయణను పొగడండి కానీ నా దగ్గర పొగడొద్దు. నేను భరించలేను. ఆయన నయవంచకుడు. నరరూప రాక్షసుడు..."

"ఎలా తెలుసు మీకు?" అన్నాడు కిల్లర్ ఆశ్చర్యం నటిస్తూ.

సునీత చటుక్కున తడబడింది—"ఏమో నా కలా గనిపించింది—...." అందామె.

"సెలవు సునీతా! చాలా థాంక్స్—...." అన్నాడు కిల్లర్.

కాసేపటికి మొబైల్ వ్యాన్ ఢిల్లీ నుంచి తెలుగు దేశానికి తిరిగింది.

"మనం బయల్దేరి ఉండుకు? తెల్సుకున్న దేమిటి?" అన్నాడు రామచరణ్ సింగ్. అతడి కంఠా ఆదుర్దా మయంగా ఉంది.

"శ్రీమన్నారాయణ సునీతను చెరిచాడు. వాళ్ళింట్లో శ్రీమన్నారాయణంటే యెలాంటి అభిప్రాయముందో తెలుసుకుందుకు నే నాయన్ని పొగిడితే అసలు కథ బయటపడింది. సునీత భరించలేక నిజాన్ని కొంత బైట పెట్టింది. నరసింగరావుకు శ్రీమన్నారాయణ దారుణ కృత్యం తెలిసివుంటుంది. అతడు అమృతసర్ ప్రయాణం వంకతో తప్పు పెద్రరిట్టులమీద తోసేయొచ్చునని శ్రీమన్నారాయణను పంజాబులో చంపాడు. నిజం కూతురి క్కూడా చెప్పలేదు.

మహావీర్ సింగ్ కొడుకుల రూపం వర్ణించి కూతురికి చెప్పివుంటాడు. ఆమె వారిపట్ల ఆరాధనా భావంతో బొమ్మ గీసింది. నరసింగరావును హంతకుడిగా నిరూపించడం కష్టంకాదు. హత్య అతడు చేశాడో, మహావీర్ సింగ్ కొడుకులు చేశారో నేను తెలుసుకోదల్చుకోలేదు. ఎందుకంటే శ్రీమన్నారాయణ తన బుద్ధికి తగ్గ దాకే

చచ్చాడు. అలాంటి స్నేహితుడు చచ్చినందుకు నువ్వు విచారించ నవసరంలేదు. ఆ కుటుంబంతో నీకు స్నేహ సంబంధాలు నశించినా బాధపడకు. నేను మాత్రం నీ ప్రమేయం లేకుండా విడిగా వెళ్ళి వాళ్ళింట్లో శ్రీమన్నారాయణ ఎలా చచ్చాడో ఎందుకు చచ్చాడో తెలుసుకొంటాను—" అన్నాడు కిల్లర్.

"అందువల్ల ప్రయోజనం?" అన్నాడు రామ్‌చరణ్ సింగ్.

"వాళ్ళింట్లో వాళ్ళు ఆయన పోయినందుకు బాధ పడుతూ ఉంటారు. ఆ బాధ కాయన అర్హుడు కాదు—...."

"నాకు తెలిసిన శ్రీమన్నారాయణ యెంతో మంచి వాడు...."

కిల్లర్ నవ్వి—"మంచితనం పైకి కనపడవచ్చు. సునీత వంటి చిన్న అమ్మాయిని బలాత్కరించినవాడు స్వతహాగా చెడ్డవాడై ఉండాలి....అలాంటి బుద్ధి ఒక్కరోజులో ఏర్పడేది కాదు...."

"ఏమో—ఆ అమ్మాయి యెలాంటిదో?" అన్నాడు రాంచరణ్ సింగ్.

"ఆ అమ్మాయెలాంటిదైనా శ్రీమన్నారాయణ దుర్మార్గం బుజావు చేయడానికొక్క తిరుగులేని సాక్ష్యముంది—"

"ఏమిటది!"

"సునీత గీసిన బొమ్మ....ఆ బొమ్మలో ముగ్గురు వ్యక్తు లున్నారు. వారికళ్ళలో పవిత్రకార్యాన్ని నిర్వహించినవారి లక్షణాలున్నాయి. త్యాగశీలత, ధైర్యసాహసాలు...."

అతన్ని ఆమెకు శ్రీమన్నారాయణపట్ల గల ద్వేషాన్ని తెలియబర్చుతాయి...."

"నీవు చెప్పినది నిజమే! నేనైతే యింత దూరం ఆలోచించలేను. కానీ యిలా జరిగిందంటే యెవరు నమ్ముతారు?" అన్నాడు సింగ్.

"నువ్వు చెబితే యెవరూ నమ్మరు. కానీ నేను చెబితే నమ్ముతారు. శ్రీమన్నారాయణ కుటుంబంలో అంతా ఆయనలాంటి వారేమో నాకు తెలియదు. వారెలాంటి వారైనా ఆయన గురించిన నిజం తెలుసుకోవడం మంచిది."

"తెలుసుకుంటే నరసింగరావు నురికంబ మెక్కించా అనుకుంటారు!"

"నరసింగరావు ఉరికంబ మెక్కాలంటే—శ్రీమన్నారాయణ అసలు రంగు బయటపడుతుంది...."

సింగ్ తల పట్టుకుని—"ఇప్పుడేం జరుగుతుంది!" అన్నాడు.

"అసలు కథ తెలుసుకున్నాక ఆ యింట్లో యెవరికైనా వెధవ బుద్ధులుంటే మానుకుంటారు. మంచి బుద్ధి ఉంటే నీ బోటివాడితో తిరిగి స్నేహం చేస్తారు...."

"శ్రీమన్నారాయణ ఎలాంటివారైనా నాకు శోభిత అంటే ఇష్టం. ఆమె మంచిది. ఆ కుటుంబంతో స్నేహసంబంధాలు కోరుతున్నాను నేను.... నేను కోరినది జరిగితే—నువ్వు కోరిన ఫీజు నిస్తాను...."

"టెర్రరిజాన్ని నిరసించే సిక్కుగా పేపర్లో కెక్కు. నీవారినందర్నీ అందుకు ప్రోత్సహించు. నీ నుంచి నేను కోరే ఫీజు అదే!" అన్నాడు కిల్లర్.

ఆ తర్వాత మూడు రోజులకి శివరాజా సింగ్ ఇంటికి వెళ్ళాడు.

"ఇంట్లోనే ఉన్నావా? ఎప్పుడొచ్చావ్?" అని స్నేహపూర్వకంగా పలకరించాడతడు.

"నాతో నీ కేమిటి పని?" అన్నాడు సింగ్.

"నాకేం పనిలేదు. భాభీజీ నిన్ను టీకి రమ్మని పిలిచింది. చెప్పడానికి వచ్చాను...." అన్నాడు శివరాజా.

రామచరణ్ సింగ్ కళ్ళలో మెరుపు! మనసులో కిల్లర్‌కి ధన్యవాదాలు!

—: అ యి పో యిం ది :—